# ఉచితం



మీ యిష్టమొచ్చినరంగులో పూర్తి సైజు కాశ్మీరు శాలువ రూ. 7 లకు పొందండి.పోస్టేజిరు.1-25. రెండు శాలువలు రూ. 13— పోస్టేజి రు. 2— మూడు శాలువలు రు. 18— పోస్టేజి ఉచితం. నాలుగు శాలువలు రూ. 24— పోస్టేజి రూ. 3—75 అదనం.

ఉచితం: నాలుగు శాలువలు కొనినవారికి రెండు సిల్కు స్త్రీల రుమాళ్ళు. స్టాకు కొద్దిగా ఉన్నది.

MAHALAXMI (Shawl),
Post Box 1595, (WAP.) Delhi-6.



# జాప్పి పాకెట్ రేడియో

జపాన్‌వారిచే కనుగొనబడిన జేబు రేడియో. పెద్ద రేడియోవలె పలుకుతుంది. అన్ని ట్రాన్సిస్టర్లు, లౌడ్ స్పీకర్లు గ్యారంటీ, జపాన్ తయారీ. నడుస్తూ సంగీతం వినండి. ప్రపంచంలో ప్రతి స్టేషను స్థానికంగా వినబడేటట్లు గ్యారంటీ. వాడడానికి, వినడానికి సిద్ధంగా సప్లయి చేయబడుతున్నది. టార్చిసెల్సుతో పనిచేస్తుంది. చిన్నది. తేలికైనది. మూడు సంవత్సరముల గ్యారంటీ. TP-88 వెల: రు. 35/—వి.పి.పి. చార్జీలు రు. 4/— రేడియోకేసు రు. 5/—.



INDUSCO (WAP-68)
Phaphala, Aligarh


# అనుభవం

(8 వ పేజీ తరువాయి)

మీ వెంట పడ్డాను. కాని, మీలోని ఏ ఆకర్షణో మీ ఆలోచన నా నుండి తప్పించలేక పోయింది. ఆ రాత్రి తిరిగి నే నక్కడికి రావడానికి కారణం మీ ఆలోచనవల్లనే. ఎన్నోసార్లు నన్ను నేనే సరిపెట్టుకోవాలని చూచాను. "ఛీ! ఏమిటిది! ఆమె ఎవరో కనీసం తెలియునన్నా తెలియదు! ఎందుకీ ఆలాపన!" అని నన్ను నేనేతిట్టుకున్నాను. కాని, తిరిగి తాజ్ దగ్గర మిమ్మల్ని చూడగానే అది నా అదృష్టమనే పొంగిపోయాను. ఆ ఆకర్షణ ఒత్తిడివల్లనే మీరు వెళ్ళిపోతూంటే ఆ పాట పాడాను. దానికి మీ రిచ్చిన సమాధానానికి ఎంతగానో నొచ్చుకున్నాను. మీ రిదివరలో నాలో చూచిన చిలిపితనం ఇప్పుడు చూడలేకపోవడానికి కారణం మీరే అంటే నమ్ముతారా?' అని ఒక్కక్షణం ఆగాడు. అతడు నా అందాన్ని పొగుడుతున్నప్పుడు నన్నుగూర్చి ఆలోచించానన్నపుడు స్త్రీ సహజమైన గర్వం నన్ను చుట్టుముట్టింది! తిరిగి అతడు, "నాకు ఒక వ్యక్తి సంఘంలో పరువుగా బ్రతకడానికి, పదిమందిలో నిలబడడానికి కావలసిన లక్షణాలన్నీ ఉన్నాయి!" అని ఇంకేమో చెప్పబోతుండగా వెంటనే అన్నాను:

"అందుకే మీ రెప్పుడు నాకు సహృదయుడయిన స్నేహితుడుగా గుర్తు ఉంటూనే ఉంటారు. క్షమించండి! నాకు వివాహాత్పూర్వపు ప్రేమ పట్ల నమ్మకం లేదు. వస్తాను!" అని లేచి ముందుకు సాగాను. కొంత దూరం పోయి ఎందుకో నాకు తెలియకుండానే వెనుదిరిగి చూచాను.

అతని కళ్ళలో నీళ్ళు నిలిచి ఉన్నాయి. నా హృదయం కలుక్కుమంది. వెనుదిరిగి వెళ్ళి అతన్ని అక్కున జేర్చుకుని కన్నీళ్ళు తుడుద్దామా అనిపించింది. కాని, ఒక్కక్షణం ఆలోచించాను. అతని కన్నీటికి నే నెంతవరకు బాధ్యురాల్ని? ప్రేమిస్తున్నానని ఆశ చూపలేదు. పెళ్ళి చేసుకుంటానని మోసగించలేదు. ఆకాశదీపాల్ని అందుకోవాలని ప్రయత్నించడం అతనిదే తప్పు. అంతే. వెనుదిరిగి గబగబా నడిచిపోయాను. జరిగింది ఇంతే. కాని, ఆ సంఘటన మాత్రం చిన్నతనపు చిలిపిచేష్టలా, తలిదండ్రుల ఆదరణలా, ప్రథమరాత్రి సమాగమంలా—ఎప్పటికి మరుపురాదు."

• • •

నుదుట కల్యాణ తిలకం, తలలో సువాసనలు విరజిమ్మే జాజులు, అక్కడక్కడ పసుపు అంటిన మధుపర్కాలతో దేవపారిజాతం లా మెరిసిపోతున్న కళ్యాణి చెప్పడం ఆపుజేసింది. చుట్టూ ఉన్నవాళ్ళంతా ఏదో పెద్ద సస్పెన్సు చిత్రం చూచిన తరవాత ఊపిరిపీల్చుకున్నట్లు నిట్టూర్చారు. ఆ కథ కొంతమందికి ఆనందదాయకమయితే, మరికొంతమంది చదువుకున్న అమ్మాయిలు తమ సదభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ, "ఆ చదువుకునే రోజుల్లో ఏ కథా ఉండకుండా ఉంటుందా?" అంటూ జారుకున్నారు. కొంతమంది మాత్రం కళ్యాణి చొరవకు, ఒకవేళ అలా జరిగినా చెప్పగలిగిన ధైర్యానికి విస్తుపోయారు. భర్త సుధాకర్ మాత్రం చిన్నగా నవ్వుతూ "ఇది కథ కాదుకదా!"


ASP: MICO-6







MICO ®

LICENCE BOSCH

® రిజిస్టర్డు ట్రేడ్ మార్కు

సిసలైన
మైకో
ఫిల్టర్ ఇన్సర్టులు
మీ ఫ్యూయల్ ఇంజక్షన్
ఎక్విప్‌మెంటును
రక్షించగలవు.

మోటారు ఇండస్ట్రీస్ కంపెని లిమిటెడ్, బెంగళూరు

అనుమతిపొందిన ప్రతినిధులు :

దుర్గా డీసెల్ హౌస్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ.

నేషనల్ ఆటో & హార్డ్‌వేర్ స్టోర్స్, కాశేశ్వరరావు రోడ్
బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ-2.

సైపీర్ ఆటోమొబైల్స్, ట్రంకురోడ్, గుంటూరు-1.

శ్రీరామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్.,
పోస్టుబాక్సు నెం. 42, కాకినాడ.

అన్నాడు. "కాదు. ఒకప్పుడు వాస్తవాలు కల్పనకన్న నమ్మలేనట్లుగా ఉంటాయి! అందుకే కర్మ—కొన్ని కొన్ని నిజాల్ని వ్రాసిపంపినా పత్రికలవాళ్ళు వేసుకోరు!" అంది. చుట్టూ ఉన్నవాళ్ళలో కలిగిన అలజడి గమనించిన ఒకరు మాత్రం ముందుకు వచ్చి నెమ్మదిగా కళ్యాణితో "ఒకవేళ నిజంగా ఇది జరిగినా నీవు అలా చెప్పకుండా ఉండవలసింది"—అన్నారు. దానికి కళ్యాణి "ఎందుచేత? అలా చెప్పగలిగిన నా ఆత్మ విశ్వాసానికి నేను గర్వపడుతున్నాను. మనలో దోషం ఉన్నప్పుడు అటువంటి టాపిక్ వస్తే ఎక్కడ మన సుఖంలో రంగులు కనబడతాయోనని దాటవేయవలసిన అవసరం! స్నేహాన్ని స్నేహంలా నిలుపుకోగల సంస్కారం ఉన్నవాడు భయానికి తావేమిటి?" అని ధీమాగా అంది.

"కాదని నేననను! కాని, ఇది ఇంచుమించు ప్రేమ వ్యవహారం లాంటిది! అందులోను అతడెవరో విన్న గూర్చి ఆలోచించడం!"

మధ్యలో అందుకుంది. "తప్పేముంది? మన ఇంటిముందు అందమైన తోటని అందరు మెచ్చుకుంటూంటే ఆనందించటం లేదా? చక్కగా అలంకరించిన ఇంటిని పదిమంది పొగుడుతూంటే సంతోషించడం లేదా? మనలోని ఇతర లక్షణాల్ని పదిమందీ శ్లాఘిస్తూంటే శ్రవణానందకరం కావడం లేదా? ఆ పొగడ్తలన్నీ మనకి మనమే ఇతరులతో చెబుతామే! అటువంటిదే అందమూను. దానికి ఒకరు ఆకర్షితులైనపుడు సిగ్గెందుకు పడాలి? అది తప్పుగా ఎందుకు భావించాలి?" ఆ పెద్దమనిషికి మాటలు దొరకలేదు. నెమ్మదిగా వాస్తుతూ "కాని నే ఊహించే సంస్కారం అందరిలోను ఉండదూ!" అన్నాడు.


"అలా సంస్కారం లేదని మనల్ని మనమే వంచించుకుంటూ వాటినే రహస్యాలుగా రూపొందిస్తున్నంత కాలం ఆ సంస్కారం రానేరాదు!" సూటిగా చెప్పింది. ఆయన తిరిగి మాట్లాడలేదు.

ఆ మాటలతో చుట్టూ ఉన్న కొద్దిమందికి కళ్యాణిపట్ల మరింత ఆసక్తి పెరిగింది. అంతా ఆమాటలకు సుధాకర్ ఏమనుకున్నాడో అని అనుకుంటూండగా, ఆ సుధాకరుడు మాత్రం ఎప్పటిలా చల్లగా నిండుగా నవ్వుతూనే ఉన్నాడు.

తెల్లవారి స్నానానికని ఇవతలికి వస్తూండగా సుధా

శోభ

చిత్రం — కె. శేషగిరిరావు (విజయనగరం-1)



కర్ వచ్చి పక్కనున్న వ్యక్తిని పరిచయం చేస్తూ "చూడు, కళ్యాణీ, నిన్నటినుండి రాలేదు రాలేదనుకుంటున్న వీడే నా పెద్ద తమ్ముడు! ప్రస్తుతం డెహరాడూన్‌లో సాయిల్ కన్సర్వేషన్ ట్రైనింగు అవుతున్నాడు. అందుచేతే మన పెళ్ళికి టైమ్‌కి రాలేకపోయాడు." అని ఫుల్‌స్టాప్ లేకుండా చెప్పాడు. కళ్లెత్తి చూచిన కళ్యాణి "ఈరోజు అయినా వచ్చారు! చాలా సంతోషం!" అని మాత్రం అనగలిగింది.

ఆరోజు సుధాకర్—కళ్యాణి ఆశలకు. ఆనందానికి నాందీ గీతమైన మొదటి రాత్రి! కాని సుధాకరుడెందుకో చిన్నబోయే ఉన్నాడు. కళ్యాణి కూడా కొత్తకోర్కెల మత్తులో ఊగిపోవడానికి మారుగా నిరంతరం ఆలోచనా నిమగ్న అయి అర్థ మనస్కంగా ఉంది. ఎవరో స్నేహితుణ్ణి కలవాలని వెళ్లిపోయాడు. ఈ సంఘటనలు సుధాకర్‌ను ఉండవలసినంత హుషారుగా ఉండనీయడం లేదు.

గదిలోకి అడుగు పెట్టిన కళ్యాణితో చతురోక్తులు అయిన తరవాత కూడా ఆమె ముఖంలో కనిపించే బాధా వీచిక చూచి, "కళ్యాణీ, ఎందుకింత నిరాశగా ఉన్నావు? మొన్నటి నీ వాగ్ధోరణి, చురుకుతనం ఏమయ్యాయి?" అని మృదువుగానే బాధతో ప్రశ్నించాడు. కళ్యాణి తల పైకెత్తి అతని నయనాలలో తొంగి చూస్తున్న నిరుత్సాహాన్ని గమనించి "నిరాశ ఏమీ లేదు—కాని నా ప్రశ్నకు మీరు సూటిగా సమాధానం ఇస్తారా?" అంది. "ఏమిటది?" విస్మయంగా అడిగాడు.

"నేను మొన్న చెప్పిన సంఘటన, ఆతరవాత నా వాదన విని నన్ను గూర్చి ఏమనుకున్నారు?" కళ్యాణి ప్రశ్న విని సుధాకర్ ఫక్కుమన్నాడు. ప్రేమగా అక్కున చేర్చుకుంటూ "పిచ్చిదానా! అదా సంగతి! నిజంగా, కళ్యాణీ, నీవు చెప్పినప్పుడు ముందర ఎంత చక్కగా కథలు చెప్పగలవా అని నవ్వుకున్నాను. నీవది కథ కాదన్నపుడు అలా జరిగింది జరిగినట్లు చెప్పగలిగిన నీ ధైర్యానికి పొంగిపోయాను! ఆతరవాత మాటాపతో నీవాదన విని అక్షణాన నేపొందిన ఆనందం ఏమని చెప్పను? నీసంస్కారానికి, పవిత్రతకి, ఆత్మవిశ్వాసానికి జోహార్లు అర్పించాను. నీలాంటి భార్యని పొందగలగడం నా ఒక్కడి అదృష్టమేననుకుంటున్నాను!" అన్నాడు. అతని మాట ఇంకా పూర్తికాకుండానే నెమ్మదిగా అతని చేతులు విడిపించుకునికిటికీ దగ్గరగా వెళ్లి నిలుచుంది. ఆమె అలా ఎందుకు వెళ్లిపోయిందో అర్థం కాక వెనకనే వచ్చి చుబుకాన్ని పట్టి ఆమె ముఖాన్ని తన వైపుకి త్రిప్పుకొన్న సుధాకర్ ఆమె కళ్లలో నిల్చిన నీరు చూచి త్రుళ్లిపడ్డాడు.

బరువుగా కనురెప్పలు వాలుస్తూ "చందమామ చిలిపి వెన్నెల ఆనందదాయకమే కాదు, ఒకప్పుడు బాధాకరం కూడాను!'

అలాగే జీవితంలో కొన్ని సంఘటనలు. క్షమించండి! నాకు ఎవర్ని మోసం చేయడం ఇష్టం లేదు. అందులోను మీనుండి ఏమి దాచడం నాకిష్టం లేదు. నేను—నేను మీరనుకుంటున్నట్లు పవిత్రురాలినే, సంస్కారినే. కానీ కానీ—

'కానీ' —

'అతడు— అతడు— మీ తమ్ముడు!' అంది. ★

# నిరీక్షణ

## సురభి నరసింహము

రారమ్మ, రారమ్మ రమణీయ కవితా!
రాగాల చిరుజిమ్ము, రసభావ భరితా!

ఎటనుంటివో నీవు? ఏమైతివో యేమొ?
గగన కుసుమముపోలె, కనరావదేలనో!
నిసుపిడి నిదిషమ్ము, నిలువ లేకున్నాను!
నసుపిడి యెచ్చోట, నర్తించుచున్నావు?

వలరాజు సేవలో, వర్తించుచుంటివో?
నెలరాజు కొలువులో, అలరారుచుంటివో?
కలనైన కనిపించి, కవ్వింప రావేమి?
కలగీతి వినిపించి, గిలిగింత లిడవేమి?

మృదుపదమ్ముల నొసగి, పొదిగి పొందికమీర,
మధుభావ సంభరిత సుధల నీయ విదేమి?
మధునైన భావాల, ప్రజ్వలింపగజేసి
కదన వీరుల యెదల, క్రాంతి నింపవదేమి?

మిసుగు చెందిన మదిని, హసియింపగాజేసి,
విశ్వసౌందర్యమ్ము, విలసిల్లగాజేసి,
అనురాగ భావాల, ఆనంద గీతాల,
కలిగించి, వెల్లించి, వెలుగుజూపవదేమి?

సిరివైన, విరివైన, చెలువారు చెలివైన,
వనివైన, ధునివైన, వజ్రాల గనివైన,
నీవకాదే! మదికి, నిండు మోదము గూర్ప,
కల్హార మాలికగ, కనువిందు విడవేమి?

సూటిగా, తేటగా, సూక్తి మాలిక లీయ
చాటుగా, మాటుగా, నరసోక్తి విరియింప,
విశ్వకల్యాణమ్ము, విమలశోభల వెలుగ,
విజ్ఞానదాత్రివై, విహరింప రావేల?

కలి వెతలలో మునిగి, కలతజెందుచు మిగుల
కవిత రువ్వుచదేమి? కళలు చేయునదేమి?
అనాడి వారల యెదల, అనురాగముదయింప,
సరస సాహిత్యమ్మ, సమకూర్పగా రమ్మ!

నిదురించు లోకాల, కదిలించి మేల్కొలువ,
శిథిలించు శాత్రవుల, వెదిరించి పీడ్కొలువ
కదలిరా! కదలిరా! కవితామతల్లికా!
మధుపూర్ణ నవభావ మందారడోలికా!

నవ వసంతమె సతము, నాట్యమాడిన యట్లు
కుసుమ గంధమొహ్వాదుల, ప్రసరించుచున్నట్లు,
స్నేహానురాగములు, చెలువారగా మిగుల,
జగతిలో నిపేలు, జనులు మరువని యట్లు,

రారమ్మ, రారమ్మ, రమణీయ కవితా!
రాగాల చిరుజిమ్ము, రసభావ భరితా! •